సాక్షి
రాజన్న సిరిసిల్ల
ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024

న్యూస్‌రీల్

ధాన్యం తరుగు తీయొద్దు



మాట్లాడుతున్న కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట(మానకొండూరు): ధాన్యం తూకంలో తరుగు తీస్తే కఠిన చర్యలు తప్పవని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హెచ్చరించారు. శనివారం నిర్వహించిన ఇల్లంతకుంట పీఏసీఎస్ మహాజన సభ సమావేశానికి హాజరై మాట్లాడారు. రైతులు సైతం ధాన్యాన్ని తేమ లేకుండా తీసుకురావాలని సూచించారు. అంతకుముందు నూతనంగా నిర్మించిన సొసైటీ సమావేశ మందిరాన్ని ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి, సెస్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు, కార్యదర్శి రవీందర్ రెడ్డి, ఐరెడ్డి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆటల్లోనూ రాణించాలి



మాట్లాడుతున్న జిందం కళ

సిరిసిల్లటౌన్: విద్యార్థులు చదువులతోపాటు ఆటపాటల్లోనూ రాణించాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ కోరారు. స్థానిక మినీస్టేడియంలో శనివారం జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజనోత్సవాల జిల్లా స్థాయి సెలెక్షన్స్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. 15 నుంచి 29 ఏళ్ల వరకు యువతీ, యువకులు జానపద నృత్యాలు, గేయాలు, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో రాణించారు. డీఈవో రమేశ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్ రాపెల్లి అరుణ, యువజన , క్రీడల శాఖ అధికారి రాందాసు, ఎస్జీఎఫ్ సెక్రటరీ దేవత ప్రభాకర్ పాల్గొన్నారు.


క్రమశిక్షణతో ఉండాలి



డీడబ్ల్యూవోను సత్కరిస్తున్న అధ్యాపకులు


సిరిసిల్లకల్చరల్: క్రమశిక్షణతో లక్ష్యాన్ని సాధించాలని జిల్లా సంక్షేమాధికారి పి.లక్ష్మీరాజం తెలిపారు. సెస్ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో శనివారం నూతన విద్యార్థులకు స్వాగతోత్సవం నిర్వహించారు. డీడబ్ల్యూవో లక్ష్మీరాజం మాట్లాడుతూ ఆడపిల్లలపై జరుగుతున్న దురాగతాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సాంకేతికతను జ్ఞాన సముపార్జనకు వినియోగించుకోవాలని సూచించారు. మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ బోనాల రోజా, కళాశాల ప్రిన్సిపాల్ వనజకుమారి, అధ్యాపకులు మురళి, సీతారామ్, శ్రీనివాస్, సునీత, ప్రవీణ్ కుమార్, నవీన్‌కుమార్ అఫ్రోజ్ సుల్తానా, జబీ ఉల్లా, గంగరాజు, భూపాల్, అనిత పాల్గొన్నారు.

మిడ్‌మానేరులో 26 టీఎంసీలు



బోయినపల్లి(చొప్పదండి): శ్రీరాజరాజేశ్వర(మిడ్‌మానేరు) ప్రాజెక్టులో నీటిమట్టం 26.452 టీఎంసీలకు చేరింది. ఎల్‌ఎండీకి 8,880 క్యూసెక్కుల మేర నీరు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి 10,500 క్యూసెక్కుల మేర నీరు ఇన్‌ఫ్లోగా వస్తోంది.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



వేములవాడఅర్బన్: సీసీ కెమెరాలతో నేరాలు నియంత్రణలో ఉంటాయని వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి అన్నారు. వేములవాడ పరిధిలోని ఫంక్షన్‌హాల్స్, హాస్పిటళ్ల యాజమాన్యాలతో శనివారం సమావేశమయ్యారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో లాభాలు, వాటి ఉపయోగాలు ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి వివరించారు. ఇటీవల చాలా కేసులు సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా ఛేదించినట్లు వివరించారు. వేములవాడలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకొచ్చిన హాస్పిటల్స్ యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ అధికారులు, ఆస్పత్రి యాజమాన్యాలు పాల్గొన్నారు.

వస్త్రపరిశ్రమకు వైభవం తెస్తాం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- పాలిస్టర్ వస్త్రోత్పత్తి సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం



నూతన కార్యవర్గాన్ని, అభినందిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్ల వస్త్రపరిశ్రమను సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు శాశ్వత పరిష్కారానికి ప్రయత్నిస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం స్థానిక పద్మశాలి కల్యాణ భవనంలో శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వం బకాయపడిన నిధుల్లో రూ.197కోట్లను ఇప్పటికే విడుదల చేశామన్నారు. పరిశ్రమ పురోగతికి కార్మికుల ఉపాధికి దోహదం చేసేలా యూనిఫామ్స్ ఆర్డర్లు ఇచ్చామన్నారు. 8 కోట్ల మీటర్లతో సుమారు 1.30కోట్ల చీరల ఉత్పత్తికి ఆర్డర్లను కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. 20 హెచ్‌పీల వరకు కరెంట్ సబ్సిడీ విషయాన్ని ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామని హామీ ఇచ్చారు. ఆధునిక యంత్రాల వినియోగంతో వస్త్రోత్పత్తిలో సిరిసిల్ల నవ్యరీతిలో సాగిపోవాలని ఆకాంక్షించారు. పరిశ్రమలోని ఇతర సమస్యల పరిష్కారానికి త్వరలోనే రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాల కంటే మిన్నగా వస్త్రపరిశ్రమ అభివృద్ధిపై కాంగ్రెస్ చిత్తశుద్ధితో ఉందన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ నూతన కార్యవర్గాన్ని సెల్‌ఫోన్‌లో అభినందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెల్ముల స్వరూప, నాయకులు సంగీతం శ్రీనివాస్, గోలి వెంకటరమణ, గూడూరి ప్రవీణ్, జిందం చక్రపాణి, అడ్డగట్ల మురళి, బొద్దుల సుదర్శన్, కల్యాడపు సుభాష్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా ఆడెపు భాస్కర్, అంకాలపు రవి, ప్రమాణ స్వీకారం చేశారు. ఉపాధ్యక్షుడిగా దూడం రమేశ్, కోశాధికారిగా మండల బాలరాజు, సహాయ కార్యదర్శిగా బండారి అశోక్ ప్రమాణ స్వీకారం చేశారు.

ఆర్డీవో ఆఫీస్‌లో విజిలెన్స్ తనిఖీలు

- రెండో దఫా విచారణ
- పాత రేషన్‌డీలర్ల నిరసన
- 'సాక్షి'లో వచ్చిన 'లీడర్లే.. డీలర్లు' కథనంపై స్పందన



ఆర్డీవో ఆఫీస్ ఎదుట పాత రేషన్‌డీలర్ల ధర్నా

సిరిసిల్ల: సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్‌లో శనివారం పౌరసరఫరాలశాఖ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేశారు. సిరిసిల్ల డివిజన్‌లో 52 మంది రేషన్‌డీలర్ల నియామకాల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. రాజకీయ జోక్యంతో రేషన్ డీలర్‌షిప్‌లను కట్టబెట్టారని పేర్కొంటూ 'లీడర్లే.. డీలర్లు' శీర్షిక 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. అదే రోజు పౌరసరఫరాలశాఖ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆర్డీవో ఆఫీస్‌లో రికార్డులు తనిఖీ చేశారు. మరోసారి శనివారం వచ్చి తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో ఏఎస్పీ స్థాయి అధికారి శశిధర్, డీఎస్పీ స్థాయి అధికారి ప్రభాకర్ తనిఖీల్లో పాల్గొన్నట్లు సమాచారం. డీలర్లకు సంబంధించిన రికార్డులు సీజ్ చేసి హైదరాబాద్‌కు తీసుకెళ్లినట్లు తెలిసింది.

నియామకపత్రాలు అందించి.. మెరిట్ లిస్ట్ వెల్లడించి !

సిరిసిల్ల ప్రాంతంలో 52 రేషన్ డీలర్లకు సంబంధించిన నియామకపత్రాలను గోప్యంగా అందించిన రెవెన్యూ అధికారులు శనివారం డీలర్ల పరీక్షల ఫలితాలు, మెరిట్‌లిస్ట్ వెల్లడించడం విశేషం. రేషన్ డీలర్ల పోస్టులకు రాతపరీక్షలు నిర్వహించిన అధికారులు, ఆ పరీక్షల ఫలితాలు వెల్లడించకుండానే.. ఓరల్ ఇంటర్వ్యూలు మొక్కుబడిగా నిర్వహించిన అధికార పార్టీ నేతల అనుచరులకు, కుటుంబ సభ్యులకు డీలర్‌షిప్‌లను కట్టబెట్టారు. తాజాగా పరీక్షల మెరిట్‌లిస్ట్‌ను ఆలస్యంగా వెల్లడించడం రెవెన్యూ అధికారులు డొల్లతనానికి నిదర్శనంగా నిలుస్తోంది. మరోవైపు గతంలో పొదుపు సంఘాల పేరిట రేషన్‌షాపులను నిర్వహించిన పాత రేషన్‌డీలర్లు శనివారం ఆర్డీవో ఆఫీస్ ఎదుట నిరసన తెలిపారు. ఈ నెల రేషన్ సరుకులకు తామే డీడీలు చెల్లిస్తామని స్పష్టం చేశారు. సిరిసిల్ల ప్రాంతంలో రేషన్ షాపుల కేటాయింపుల్లో అక్రమాలపై బీఆర్‌ఎస్ నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. మొత్తంగా రేషన్ డీలర్ల నియామకాలు సిరిసిల్లలో చర్చనీయాంశంగా మారాయి.

హైదరాబాద్‌లో సిరిసిల్ల చీరల ప్రదర్శన



జౌళిశాఖ కమిషనర్‌ను కలిసిన సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులు

సిరిసిల్ల: సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులు నేసిన చీరలను హైదరాబాద్ చేనేత, జౌళిశాఖ ఆఫీస్‌లో శనివారం ప్రదర్శించారు. బతుకమ్మ చీరల స్థానంలో స్వశక్తి మహిళా సంఘాల సభ్యులకు ఏటా రెండు చీరలు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. గతానికి భిన్నంగా విభిన్నమైన డిజైన్లు, నాణ్యమైన చీరలు అందించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో భాగంగా సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులు పవర్‌లూమ్స్‌పై ఉత్పత్తి చేసిన 45 శాతం కాటన్, 55 శాతం పాలిస్టర్ నూలు మిశ్రమంతో రూపొందించిన చీరలను జౌళిశాఖ కమిషనర్ శైలజారామయ్యర్, టెస్కో జనరల్ మేనేజర్ అశోక్‌రావు సమక్షంలో ప్రదర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వైవిధ్యమైన డిజైన్లతో కూడిన చీరలను జౌళి శాఖ అధికారులు తెప్పిస్తున్నారు. పాలిస్టర్, కాటన్ మిశ్రమంగా తయారైన చీరలను ప్రాసెసింగ్ అవసరం లేకుండానే ఉత్పత్తి చేయవచ్చని వస్త్రోత్పత్తి దారులు స్పష్టం చేశారు. వస్త్రోత్పత్తిదారులు గోవిందు శ్రీకాంత్, వేముల దామోదర్, గడ్డం ప్రసాద్, శంకర్, భీముని రామచంద్రం ఉన్నారు.

రంగంపేటకు జాతీయస్థాయి గుర్తింపు



రికార్డులు పరిశీలిస్తున్న జాయింట్ కమిషనర్

వీర్నపల్లి(సిరిసిల్ల): జాతీయ పంచాయతీ అవార్డుల్లో ఆరోగ్య విభాగంలో నామినేట్ అయిన మండలంలోని రంగంపేట గ్రామాన్ని శనివారం పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ శ్రీనివాస్ పరిశీలించారు. రిజిస్టర్లను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. జెడ్పీ సీఈవో వినోద్‌కుమార్, డిప్యూటీ సీఈవో గీత సందర్శించారు. పంచాయతీ సెక్రటరీ పురుషోత్తం, హెల్త్ సూపర్‌వైజర్ పద్మ, ఎంపీహెచ్‌పీ చైతన్య, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీనర్సవ్వ, ఆశ జీవంతి పాల్గొన్నారు.

6,172 కేసులు పరిష్కారం



కక్షిదారులను అభినందిస్తున్న న్యాయమూర్తులు



కోర్టు ఆవరణను శుభ్రం చేస్తున్న జడ్జి కిరణ్మయి

- రాజీకి మొగ్గుచూపిన కక్షిదారులు
- అభినందించిన జిల్లా న్యాయమూర్తులు

సిరిసిల్లకల్చరల్/వేములవాడ: జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ కోర్టుల్లో శనివారం నిర్వహించిన అదాలత్‌లలో 6,172 కేసులు పరిష్కారమయ్యాయి. కక్షిదారులు రాజీకి మొగ్గుచూపడంతో భారీ సంఖ్యలో కేసులు పరిష్కారానికి నోచుకున్నాయి. సివిల్, క్రిమినల్ కేసులతోపాటు ఆర్థిక సంబంధమైన కేసులు కూడా ఉన్నాయి. మొత్తం రూ.2కోట్ల 91లక్షల 41వేల 989 విలువైన కేసులు పరిష్కారానికి నోచుకున్నాయి. అదాలత్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత ప్రారంభించి మాట్లాడారు. మూడు నెలలకోసారి మాత్రమే లోక్ అదాలత్ పరిమితం కాదని, కక్షిదారుల కోరిక మేరకు జిల్లా న్యాయస్థానంలో ప్రతి రోజూ అదాలత్ నిర్వహిస్తామని తెలిపారు. లోక్ అదాలత్ కేసుల పరిష్కరించుకుంటే అది శాశ్వత పరిష్కారమని, కోర్టు ఫీజులు తిరిగి చెల్లిస్తామని చెప్పారు. విలువైన సమయం, డబ్బును వృథా చేసుకోకుండా రాజీ కుదుర్చుకోవాలని సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధికా జైస్వాల్, న్యాయమూర్తులు ప్రవీణ్‌కుమార్, కావేటి సృజన, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, చింతోజు భాస్కర్ పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు రావని జూనియర్ సివిల్ జడ్జి కిరణ్మయి తెలిపారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా వేములవాడ కోర్టు పరిసరాలను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, ప్రధాన కార్యదర్శి అవదూత రజనీకాంత్, ఏపీపీ విక్రాంత్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి ప్రోత్సాహం

- జాబ్‌మేళాలతో యువతకు ఉద్యోగావకాశాలు
- ఇప్పటికే 40వేల ఉద్యోగాల భర్తీ
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- రుద్రంగిలో మెగా జాబ్‌మేళా



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి(వేములవాడ): రాష్ట్ర ప్రభుత్వం 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న ఎన్నికల హామీ మేరకు నోటిఫికేషన్లు ఇస్తూనే మెగా జాబ్‌మేళాల ద్వారా ప్రైవేటు కంపనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో రుద్రంగిలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాబ్‌మేళాలతో యువతకు ఉపాధి బాటలు పడుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 40వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. ప్రతీ మండలంలో మెగా జాబ్‌మేళాలు నిర్వహిస్తూ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఇందిరా మహిళాశక్తి ద్వారా జిల్లాలో రూ.600కోట్లు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 125 రకాల చిరు వ్యాపారాలకు రుణం అందజేయనున్నట్లు వివరించారు.

12 కంపెనీలలో ఉద్యోగాలు

మెగా జాబ్‌మేళాలో 12 కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముందుకొచ్చాయి. అపోలో ఫార్మసీ, జీఎంఆర్, ఎల్‌ఐసీ, జీ4ఎస్, శుభగృహ ప్రాజెక్టు, సార్య కన్సల్టెన్సీతోపాటు మరికొన్ని లోకల్ కంపెనీలు జాబ్‌మేళాకు వచ్చాయి. 400 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరు కాగా 100 మందికి ఉద్యోగాలు వచ్చినట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి రాఘవేందర్ తెలిపారు.

ఉద్యోగం వచ్చింది



నేను ఇంటి వద్దే ఉంటూ వ్యవసాయం, కూలీ పనులు చేసుకుంటున్న. మెగా జాబ్ మేళాలో ఉద్యోగం వచ్చింది. నెలకు రూ.26వేల వేతనంతో ఉద్యోగం వచ్చింది. నేను పదో తరగతి చదువుకున్న.

– బానోతు శ్రీనివాస్, దెగావత్‌తండా

ఆనందంగా ఉంది



రుద్రంగిలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు హాజరైన. అపోలో ఫార్మసీ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. నెలకు రూ.16వేల జీతం ఇస్తామన్నారు. ప్రస్తుతం పీజీ చదువుతున్న. ఉద్యోగం చేస్తూనే పై చదువులు కొనసాగిస్తా.

– లావుడియా రోజా, దసరానాయక్‌తండా

నిరుద్యోగ యువతకు వరం



ప్రభుత్వం నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాలు నిరుద్యోగ యువతకు వరం. అపోలో ఫార్మసీ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. అపాయింట్ మెంట్ లెటర్ ఇచ్చారు. నెలకు రూ.16వేల వేతనం.

– మ్యాకల దినకర్, లింగంపల్లి



2 నుంచి తొమ్మిది రోజుల పండుగ
ఊరూవాడా తరుణి సందడి
ఎంగిలిపూలతో మొదలై
సద్దులతో ముగియనున్న బతుకమ్మ
ఆటపాటలతో సందడి చేయనున్న ఆడబిడ్డలు

'తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ.. ఈ పండుగ వచ్చిందంటే పల్లె, పట్టణం తేడా లేకుండా పూల పరిమళాలు వెదజల్లుతాయి.. గునుగు, తంగేడు, పట్టుకుచ్చులు, బంతి, చామంతి, రుద్రాక్ష, గోరింట.. ఇలా తీరొక్క పువ్వు బతుకమ్మను ఆహ్వానిస్తుంది.. పూల పూజకు వేళైంది.. బుధవారం నుంచి ఎంగిలిపూలు మొదలు సద్దుల వరకు ఆడబిడ్డలు తొమ్మిది రోజులపాటు బతుకమ్మను ఆటపాటలతో కొలుస్తారు. పంటలు, పిల్లాజెల్లా, గొడ్డుగోదా బాగుండాలని కోరుకుంటారు.'

సాక్షి Festival Special

పూల జాతరకు వేళాయె

విద్యానగర్(కరీంనగర్): ప్రకృతిని ఆరాధిస్తూ తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పే పూల పండుగ బతుకమ్మ. ఆడబిడ్డలకు ఎంతో ఇష్టం. మహిళలు అత్తింటి నుంచి పుట్టింటికి చేరుకుంటారు. ప్రకృతిలో లభించే తీరొక్క పూలను సేకరించి, బతుకమ్మను పేర్చి, గౌరమ్మను పూజిస్తారు. వచ్చే నెల 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు సందడి వాతావరణం నెలకొననుంది. వీధులన్నీ పాటలతో హోరెత్తనున్నాయి. పూలు, దుస్తుల కొనుగోలుతో మార్కెట్లు, వస్త్ర దుకాణాలు కళకళలాడనున్నాయి.

ఒక్కో రోజు ఒక్కో పేరుతో..

తొలిరోజు బతుకమ్మను ఎంగిలిపూల బతుకమ్మ అంటారు. ముందురోజు కోసిన పూలను నీళ్లలో వేసి, మరునాడు అలంకరణకు వాడటం వల్ల ఇలా పిలుస్తారు. రెండో రోజు అటుకుల, మూడో రోజు ముద్దపప్పు, నాలుగో రోజు నానబియ్యం, అయిదో రోజు అట్ల, ఆరో రోజు అలిగిన బతుకమ్మ అంటారు. ఆరో రోజు అమ్మవారు అలకలో ఉంటుందని నమ్మి, బతుకమ్మ ఆడరు. ఏడోరోజు వేపకాయల, ఎనిమిదో రోజు వెన్నముద్దల, తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ అంటారు. చివరి రోజు ఆడబిడ్డలు ఆడిపాడి, పోయిరా బతుకమ్మ పోయిరావమ్మా.. మళ్లొచ్చే ఏడాది తిరిగి రావమ్మా.. అని వీడ్కోలు పలుకుతారు. నీళ్లలో నిమజ్జనం చేశాక.. వాయినం ఇచ్చిపుచ్చుకుంటారు.

అన్నలతో కలిసి పూలు తెచ్చేదాన్ని



ఇంట్లో నేను ఒక్కదాన్నే ఆడపిల్లను. బతుకమ్మ వస్తే ఇద్దరు అన్నలతో కలిసి పొలాల వెంట తిరుగుతూ పూలు తెచ్చేదాన్ని. గుమ్మడి, తంగేడు, కట్ల, గోరింట, సీతమ్మ జడలు, గునుగు వంటి పూలు, గుమ్మడి ఆకులతో అమ్మ బతుకమ్మ పేర్చేది. నా ఈడోళ్లతో ఆడిపాడుతుంటే సంబురంగా అనిపించేది. నాకు ఐదుగురు ఆడపిల్లలు, వారికి ఎనిమిది మంది ఆడపిల్లలు. బతుకమ్మకు అందరూ ఇంటికి వస్తరు.

– గంటె అమృతమ్మ, హరిహరనగర్, కరీంనగర్

లంగా ఓణీలు కనిపిస్తలేవు



సిరిసిల్ల కల్చరల్: మా చిన్నప్పటి బతుకమ్మకు ఇప్పుడు ఆడుతున్న బతుకమ్మకు పోలికే లేదు. అప్పట్లో ఒకే వీధిలో ఉన్న ఆడపిల్లలందరం సాయంత్రం చిన్న కూడలికి చేరేవాళ్లం. ఓ పెద్దావిడ మాత్రం ఏమాత్రం అలసిపోకుండా పాడుతూ అందరినీ ఆటలో భాగస్వామ్యం చేసేది. లంగా ఓణీలు, గౌన్లు వేసుకున్నవారే కనిపించేవారు. ఇప్పుడు కనిపిస్తలేరు. సౌండ్ బాక్సుల్లో వచ్చే పాటకు, బతుకమ్మకు ఏం సంబంధమో అర్థం కావడం లేదు.

– రాపెల్లి అరుణ, మున్సిపల్ కౌన్సిలర్, సిరిసిల్ల

పాత పాటలు ఇప్పటోళ్లకు నచ్చట్లేదు



మా అమ్మవాళ్ల ఊరు పర్లపల్లి. మేము ముగ్గురు అన్నలు, ఐదుగురం అక్కాచెల్లెళ్లం. రకరకాల పూలతో బతుకమ్మలను పేర్చుతుంటే మా ఇంట్లో సందడిగా ఉండేది. అందరం కలిసి ఆడిపాడేవాళ్లం. అందరికీ పెళ్లిళ్లయ్యాక ఒక్కచోట కలవడం కుదరడం లేదు. కానీ, ఏటా బతుకమ్మకు మా ఊరెళ్లి, నేనే పాటలు పాడుతున్న. పాత పాటలు ఇప్పటోళ్లకు నచ్చట్లేదు. మైకులు, డీజేలు పెడుతున్నరు.

– చిట్టుమల్ల స్వర్ణలత, చైతన్యపురి, కరీంనగర్

పాటలు పాడేవారు లేరు



జూలపల్లి(పెద్దపల్లి): అప్పట్లో బతుకమ్మ పాటలు పాడేందుకు చాలామంది ముందుకు వచ్చేవారు. మగవాళ్లు గునుగు, తంగేడు, ఇతర పూలు తెచ్చేవారు. ఇప్పుడు ఎవరో పాడిన పాటలు పెట్టి, కోలాటం ఆడటం, చప్పట్లు కొట్టడం తప్ప పాటలు పాడేవారు లేరు. తెలంగాణ వచ్చినంక బతుకమ్మకు పేరొచ్చినా, నాటి పాటలు, సంస్కృతిని మరిచిపోతుండటం బాధగా ఉంది.

– అమరగాని ఈశ్వరమ్మ, జూలపల్లి

ఇంటి దేవతగా కొలుస్తాం..



తిమ్మాపూర్: తెలంగాణ పండుగ బతుకమ్మ. బొడ్డెమ్మ మొదలు సద్దుల బతుకమ్మ వరకు రోజుకో ప్రత్యేకత ఉంది. బతుకమ్మను ఇంటి దేవతగా కొలుస్తాం. నా చిన్నప్పటి నుంచి మా ఇంట్లో అమ్మమ్మ, అమ్మ అక్కలతో కలిసి బతుకమ్మను అలరించడం అందులో నైపుణ్యాన్ని ప్రదర్శించడం చాలా సంతోషంగా ఉంటుంది. పోటాపోటీగా బతుకమ్మను పేరుస్తాం. ఈ పండుగ మనకు నైతిక విలువలు కూడా అలవాటు చేస్తుంది.

– దుర్శెట్టి హరిణి, ఎస్సార్ కళాశాల, కురిక్యాల

పువ్వులను కీర్తిస్తూ..



బతుకమ్మ పాటల్లో కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి వుంటుంది. రకరకాల పువ్వులు రంగు రంగులలో పూసి ఉంటాయి. వీటిలో గునుగు పూలు, తంగేడు పూలు బాగా ఎక్కువగా పూస్తాయి. బంతి, చామంతి, పూలకు కూడా ఇదే సమయం. ఆడపడుచులు ప్రకృతి సౌందర్యాన్ని అద్భుతమైన రంగురంగుల పువ్వులతో కీర్తిస్తూ పండుగను జరుపుకుంటారు. బతుకమ్మ పండుగ తెలంగాణలో సౌందర్యం,ఆత్మగౌరవం పెంపొందిస్తుంది.


–ఎం.శ్రీయ, జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల, తిమ్మాపూర్

ఆడబిడ్డల పండుగ



బతుకమ్మ పూల పండుగ, ఆడబిడ్డల పండుగ. ఊరంతా సందడిగా ఉంటుంది. తొమ్మిది రోజులు రోజొక్క పేరుతో ఆడుతం. ఎక్కడ ఉన్నా..బతుకమ్మ పండుగకి సొంత ఊరికి వెళ్తాం. ఈ పండుగ ప్రకృతిని, దేవుడిని పూజించడంతో పాటు చల్లని శీతాకాలం ప్రారంభాన్ని సూచిస్తుంది. బతుకమ్మ పండుగ మహిళలకు ప్రత్యేకంగా ఉండడం మా అదృష్టం.

– మణిదీప్తి, ఎస్సార్ కళాశాల, కరీంనగర్



క్లుప్తంగా

గుండెపోటుతో అంగన్‌వాడీ టీచర్ మృతి


శంకరవ్వ (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని చిన్నలింగాపూర్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్ గంగాపురం శంకరవ్వ(55) శనివారం గుండెపోటుతో మృతిచెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. శంకరవ్వ రోజూ మాదిరిగానే అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి పిల్లలను చూసుకుంటోంది. ఆ తర్వాత మండలంలోని నేరెళ్ల పీహెచ్‌సీలో జరిగిన సమావేశానికి హాజరై తిరిగి వెళ్తుండగా పీహెచ్‌సీకి సమీపంలో గుండెపోటుతో కుప్పకూలింది. గమనించిన స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందిందని తెలిపారు. ప్రభుత్వం తరఫున జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం రూ.50వేల చెక్కును మృతురాలి తమ్ముడు పోశయ్యకు అందజేశారు.

'ఎస్సైపై చర్యలు తీసుకోవాలి'

సిరిసిల్లక్రైం: కేసుతో సంబంధం లేని వ్యక్తులను వేధింపుల గురిచేస్తున్న బోయినపల్లి ఎస్సై పృథ్వీధర్‌గౌడ్‌పై చర్యలు తీసుకోవాలని గంగాధర మండలం నీలోజుపల్లికి చెందిన సింగిరెడ్డి రమ డిమాండ్ చేసింది. ఈమేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఫిర్యాదు చేసినట్లు మీడియాకు తెలిపింది. గ్రామంలో ఓ డ్రైవర్‌పై దాడి చేసినట్లు తప్పుడు కేసు నమోదు చేసి తన కొడుకు వెంకటేశ్‌తోపాటు అల్లుడు పూస శ్రీనివాస్‌రెడ్డిపై తప్పుడు కేసులు నమోదు చేసినట్లు రమ ఆరోపించారు. కరీంనగర్‌లో నివసించే వ్యక్తిని బోయినపల్లి స్టేషన్ పరిధిలో ఉన్నట్లు తప్పుడు సమాచారం పెడుతూ జైలుకు పంపినట్లు ఆరోపించారు. కుటుంబంలో కలతలు పెరగడంతో మనస్థాపానికి గురై వెంకటేశ్ పురుగుల మందు తాగి, ప్రస్తుతం ఎల్లారెడ్డిపేటలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. తప్పుడు కేసు నమోదు చేసిన బోయినపల్లి ఎస్సైపై చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు రమ పేర్కొన్నారు.

'డబుల్' ఇళ్లను పంపిణీ చేయాలి

సిరిసిల్లకల్చరల్: నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులకు వెంటనే కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ కోరారు. శనివారం బీవైనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంపిణీ చేసిన ఇండ్లలో అనర్హులను గుర్తించి తొలగించాలని కోరారు. డ్రాలో పేరు రాని నిరుపేదలకు రూ.5లక్షలు ఇస్తామని ఎమ్మెల్యే కేటీఆర్ 44 మందికి కేవలం స్థలాల పట్టాలిచ్చారే కానీ స్థలం మాత్రం చూపించలేదని విమర్శించారు. సుమారు నిర్మాణం పూర్తయి 250 ఇళ్లు నిరుపయోగంగా ఉన్నాయని, అర్హులకు వాటిని కేటాయించాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి డ్రాలో పేరు రాని పేదలు ఈనెల 30న కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాలో పాల్గొనాలన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోడం రమణ, నక్క దేవదాస్, నల్లబాబు, కోడం శివ, కోసరి సత్యనారాయణ, సందుపట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

యువత గుండెకు ముప్పు



నేడు వరల్డ్ హార్ట్ డే

- పెరుగుతున్న గుండె సంబంధిత వ్యాధులు
- ఉన్నట్టుండి కుప్పకూలుతున్న వైనం
- మానసిక ఒత్తిడే కారణమంటున్న వైద్యులు
- యోగా, నడక, వైద్య పరీక్షలు అవసరమని సూచన

కరీంనగర్ టౌన్: మనం ఆరోగ్యంగా ఉండాలంటే ముందు మన గుండె పదిలంగా ఉండాలి. ఒకప్పుడు గుండెపోటు రావడం చాలా అరుదు. వయసు మీద పడిన వారికి మాత్రమే వచ్చేది. ఇప్పుడు చిన్నాపెద్ద తేడా లేకుండా అందరికీ వస్తోంది. డ్యాన్స్ చేస్తూ, గేమ్స్ ఆడుతూ, వ్యాయామం చేస్తూ ఉన్నట్టుండి కుప్పకూలుతున్నారు. గుండెపోటుతో ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది చనిపోతున్నారని సర్వేలు చెబుతున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గుండె జబ్బులు వస్తున్నవారి సంఖ్య వేలల్లో ఉంటోంది. మారుతున్న జీవన శైలి, ఒత్తిడి, ఆహారపు అలవాట్లతో యువతలో గుండె జబ్బు బారిన పడుతున్నవారి సంఖ్య పెరుగుతోందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అందుకే గుండెను ఫిట్‌గా ఉంచాలని సూచిస్తున్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏటా సెప్టెంబర్ 29న ప్రపంచ గుండె దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో గుండె వ్యాధుల బాధితులు

ఏడాది	30-50 ఏళ్లు	50 ఏళ్లపైన	మొత్తం
2023	2,300	3,400	5,700
2024	1,760	2,640	4,400

నిద్రపోతున్నప్పుడు ఎందుకు వస్తుంది?

ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. నిద్రపోతున్నప్పుడు గుండెపోటు రావడానికి ప్రధాన కారణం.. గుండె ప్రధాన సిరలలో ఒకటి పూర్తిగా బ్లాక్ అవవడం. లేదా దానిలో ఏదైనా అడ్డంకి కావొచ్చు. ఈ అడ్డంకికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి కొలెస్ట్రాల్ బాగా పేరుకుపోవడం. రెండోది రక్తం గడ్డకట్టడం. ఇది తాత్కాలికంగా సంభవిస్తుంది. కానీ కొలెస్ట్రాల్ ఎప్పటినుంచో ఉంటుంది. సాధారణంగా గుండెపోటు రక్తం గడ్డకట్టడం వల్ల ఏ సమయంలోనైనా రావొచ్చు.

గుండెపోటుకు ప్రధాన కారణాలు

అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ లెవెల్స్ పెరగడం, అధిక చక్కెర స్థాయిలు, శారీరక శ్రమ లేకపోవడం, అధిక బరువు, ఎప్పుడూ ఒత్తిడికి లోనవడం. అయితే, గుండెపోటుకు దారితీసే ఈ కారణాలన్నింటినీ చాలా వరకు నియంత్రించవచ్చని డాక్టర్లు అంటున్నారు. వృద్ధాప్యం, లింగ ఆధారిత (ఆడవారి కంటే మగవారికే ఎక్కువగా గుండెపోటు వస్తుంది), వంశపారంపర్యంగా వచ్చేవాటిని మాత్రం నియంత్రించలేమని చెబుతున్నారు.

లక్షణాలు ఇవీ..

ఛాతి నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఆందోళన, హృదయ స్పందన పెరగడం, మూర్ఛ, మాట్లాడటంలో ఇబ్బంది, విపరీతంగా చెమటలు పట్టడం వంటివి గుండెపోటు లక్షణాలు. అయితే, నొప్పి ఎడమ చాతి వైపు మాత్రమేఊ ఉంటుందని చాలా మంది అనుకుంటారు. కానీ, గుండెపోటు నొప్పి ఛాతిలోనే కాదు మన దవడ నుంచి నాభి వరకు ఎక్కడైనా రావొచ్చు. తర్వాత అది భుజాలు, చేతులు, ఎగువ వీపు వరకు పాకుతుంది.

నివారణ చిట్కాలు..

- బరువు పెరగకుండా జాగ్రత్త పడాలి. ప్రతీరోజు 7 నుంచి 8 గంటలు కచ్చితంగా నిద్రపోవాలి.
- క్రమం తప్పకుండా హెల్త్ చెకప్ చేయించుకోవాలి. తీయని లేదా వేయించిన ఆహార పదార్థాలను ఎక్కువగా తినకూడదు.
- స్మోకింగ్, ఆల్కహాల్ అలవాట్లకు దూరంగా ఉండాలి.
- రెగ్యులర్గా వ్యాయామం చేయాలి.
- బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ టెస్టులు చేయించుకోవాలి.

నిర్లక్ష్యం చేయొద్దు



రక్తనాళాలు మూసుకుపోయి రక్త సరఫరా తగ్గిపోవడం వల్లే గుండెలో నొప్పి వస్తుంది. దీన్ని గ్యాస్ట్రిక్ సమస్య అనుకుంటూ నిర్లక్ష్యం చేయొద్దు. ఛాతిలో బరువుగా అనిపించడం, వీపు వెనక భాగంలో నొప్పి రావడం, ఆయాసం, కళ్లు తిరగడం, చెమటలు పట్టడం వంటివి జరుగుతాయి. ఈ లక్షణాలు ఉంటే వెంటనే ఆస్పత్రికి వెళ్తే గోల్డెన్ అవర్‌లోనే ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుంది.

– కొండపాక కిరణ్, కార్డియాలజిస్టు, మెడికవర్ ఆస్పత్రి, కరీంనగర్

ప్రజలకు అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న సుజాత

హృదయ సంబంధిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కరీంనగర్ డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత అన్నారు. వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకొని, శనివారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డయాబెటిస్, హైపర్‌టెన్షన్‌కు సంబంధించిన టెస్టులు చేయించుకోవాలన్నారు. ప్రతీరోజు ఫిజికల్ యాక్టివిటీస్‌లో భాగంగా ఉదయపు నడక, పండ్లు, కూరగాయలు తీసుకోవాలని సూచించారు. అనారోగ్యానికి కారణమయ్యే ధూమపానం, పొగాకు నమలడం, ప్యాకేజీ ఫుడ్స్, ఎక్కువ శాతం ఉప్పు తీసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ సాజీదా అతహరీ, డాక్టర్ రాజగోపాల్, వెంకటేశ్వర్లు, కైక, హెల్త్ ఎడ్యుకేటర్లు, డీపీవో స్వామి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామం చేయాలి



ఫాస్ట్‌ఫుడ్స్, జంక్ ఫుడ్స్ ఎక్కువగా తినడం, వ్యాయామం లేకపోవడం వల్ల గుండె సంబంధిత వ్యాధులు వస్తాయి. తెలియకుండానే శరీరంలో కొలెస్ట్రాల్ అధిక స్థాయిలో పెరిగి, రక్తంలో బ్లాక్స్ ఏర్పడతాయి. రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోవడం వల్ల గుండె, మెదడు స్ట్రోక్ వస్తాయి. ప్రతీరోజు 45 నిమిషాల పాటు నడక లేదా వ్యాయామం చేస్తే గుండె సంబంధిత సమస్యలు దూరమవుతాయి.

– డాక్టర్ మల్లెల రాజేంద్రప్రసాద్, కార్డియో థొరాసిక్ అండ్ వాస్కులర్ సర్జన్

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు

- హైబీపీతో కోమాలోకి వెళ్లిన యువకుడు
- ఆపరేషన్‌కు రూ.15 లక్షలు అవసరం
- దాతలు సాయం చేయాలని వేడుకోలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాకేశ్

వేములవాడ/వేములవాడరూరల్: రెక్కాడితే గాని డొక్కాడని యువకుడికి పెద్ద ఆపదొచ్చింది. రాత్రి వేళ నిద్రలోనే బీపీ పెరిగి కోమాలోకి వెళ్లిపోయాడు. అతడి భార్య ఉదయం హుటాహుటినా స్థానికంగా ఓ ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమించిందని, మెరుగైన వైద్యం కోసం పెద్దాసుపత్రికి తరలించాలని సూచించారు. చేతిలో చిల్లిగవ్వలేని దీనస్థితిలో భార్య ఉండిపోయింది. విషయం తెలుసుకున్న అతడి స్నేహితులు కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి హైబీపీ వల్ల తలలో రక్తం కారుతుందని, వెంటనే ఆపరేషన్ చేయాలని చెప్పారు.

ఆపరేషన్‌కు రూ.15లక్షలు

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణానికి చెందిన సరిపెల్లి రాకేశ్ కొన్నేళ్ల క్రితమే తల్లిదండ్రులను కోల్పోయాడు. ప్రస్తుతం పని చేసుకుంటూ భార్యతో ఉంటున్నాడు. హై బీపీతో రాత్రి వేళ కోమాలోకి వెళ్లడంతో అతడి భార్య చేతిలో చిల్లిగవ్వ లేక నిస్సహాయ స్థితిలో ఉంది. ఆపరేషన్‌కు రూ.15 లక్షలు అవుతాయని వైద్యులు చెప్పడంతో దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. ప్రస్తుతం స్నేహితులు తలాకొంత జమ చేసి వైద్యం చేయిస్తున్నారు. ఆపరేషన్ చేస్తేనే తన భర్త బతుకుతాడని, దాతలు సాయం అందించాలని ఆమె వేడుకుంటోంది.

ఫోన్ పే నంబర్: 90000 03503
వేముల సంతోష్
అకౌంట్‌నంబర్ 62094528144,
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్0017241,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
వేములవాడ బ్రాంచ్

వస్త్రవ్యాపార దంపతుల ఆత్మహత్యాయత్నం

- భర్త మృతి.. చికిత్స పొందుతున్న భార్య
- వ్యాపారంలో నష్టం, అప్పులే కారణం
- భూమి కొని నష్టపోయిన వ్యాపారి


రమేశ్(ఫైల్)

సిరిసిల్లక్రైం: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన వస్త్రవ్యాపారి దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం సిరిసిల్లలో సంచలనం రేపింది. భర్త మృతిచెందగా, భార్య ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. స్థానికులు తెలిపిన వివరాలు. సిరిసిల్లకు చెందిన వస్త్రవ్యాపారి, అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సామల రమేశ్(51) వ్యాపారంలో నష్టాలు, భూమి కొనుగోలు వ్యవహారంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. అప్పులు తీర్చే మార్గం లేక మానసిక వేదనకు గురై శనివారం సాయంత్రం దంపతులు ఇద్దరు ఇంట్లోని డైయింగ్‌లో వాడే నైట్రేట్ అనే రసాయనాన్ని సేవించారు. స్థానికులు గమనించి సిరిసిల్ల ఆస్పత్రికి తరలించగా.. రమేశ్ మృతిచెందాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రమేశ్ భార్య లావణ్యను ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై సిరిసిల్ల టౌన్ ఎస్సై శ్రీనివాస్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ గర్వించదగిన హీరో పైడి జయరాజ్


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ప్రభాకర్ తదితరులు

కరీంనగర్‌కల్చరల్: తెలంగాణ గర్వించదగిన అద్భుతమైన కళాకారుడు, దర్శకుడు, నటుడు, నిర్మాత పైడి జయరాజ్ అని, స్వాతంత్య్రానికి పూర్వమే ముంబై వెళ్లి అక్కడ బాలీవుడ్‌లో తనదైన ప్రతిభతో ప్రత్యేక ముద్ర వేసి, గొప్ప హీరోగా వెలుగొందారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పైడి జయరాజ్ 115వ జయంతి సందర్భంగా ఆయన జీవితంపై ప్రముఖ జర్నలిస్ట్, నంది పురస్కార గ్రహీత పొన్నం రవిచంద్ర రాసిన 'ద ఫస్ట్ యాక్షన్ హీరో' పుస్తకాన్ని శనివారం సచివాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. కరీంనగర్ నుంచి మొదలెట్టి హైదరాబాద్ వ్యాయామశాలలో శిక్షణ పొంది, జాతీయ చలన చిత్ర సీమను కొన్ని దశాబ్దాల కాలం పాటు ఏలిన గొప్ప నటుడు పైడి జైరాజ్ అని పేర్కొన్నారు. సినిమాల్లో నటించాలనే తన కలను సాధించేందుకు ఎన్నో కష్టాలను ఎదుర్కొని గెలిచిన జైరాజ్ జీవితం ఒక వ్యక్తిత్వ వికాస పాఠం అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో తెలంగాణలో సినీరంగంలో ఎదుగుదామనుకునే నవ యువ దర్శకులు, నటులు ముందుకెళ్లాలని సూచించారు. పుస్తకావిష్కరణలో మంత్రి పొన్నం ప్రభాకర్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, తిరుపతి తదితరులున్నారు.

పరిసరాల శుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత


మొక్కలు నాటుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి(వేములవాడ): పరిశరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నార. శనివారం మండలకేంద్రంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ హాజరై మాట్లాడుతూ... పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చన్నారు. కార్యక్రమంలో భాగంగా జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ తీసి ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామ పంచాయతీ ఆవరణలో జీపీ ఆధ్వర్యంలో సఫాయిమిత్ర సురక్ష క్యాంపు నిర్వహించారు. వారికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నటరాజ్, ఫౌండేషన్ ప్రతినిధులు సెల్వరాజ్, రమణి, ఎస్‌బీఎం ఐఈసీ కన్సల్టెంటు సురేశ్, ఎంఐఎస్ కన్సల్టెంట్ ప్రేమ్‌కుమార్, డీవైఈఈ ప్రేమ్, వైద్య, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం


మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వసంతరావు

తంగళ్లపల్లి: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎంఎంజే ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ హాస్పిటల్ సౌజన్యంతో శనివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి ఎం.వసంతరావు మాట్లాడుతూ ప్రజల్లో బ్రెస్ట్, నోటి, గర్భాశయ క్యాన్సర్ల గురించి అవగాహన కల్పించిన ఎంఎస్‌జే హాస్పిటల్ డైరెక్టర్ శ్రీనివాస్‌ను అభినందించారు. వైద్య శిబిరంలో నోటి క్యాన్సర్ 33 మంది, రొమ్ము క్యాన్సర్ 23 మంది, గర్భాశయ క్యాన్సర్ 35 మందికి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్‌రెడ్డి, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు మట్ట రాజేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజలి, వైద్యులు చతుర్వేది, వాణి, నహీమ్ జహాన్, స్నేహ, రేఖ, దీప్తి, భాష, రాజకుమార్, బాలయ్య, సత్యనారాయణ, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం


మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

సిరిసిల్ల అర్బన్: రాష్ట్రంలో జాతీయ విద్యావిధానం అమలు ఆలోచనను సీఎం రేవంత్‌రెడ్డి విరమించుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి కోరారు. పట్టణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో సీఎం విఫలమయ్యారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిగాలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్రంలో బీజేపీ అమలుచేసిన నూతన జాతీయ విద్యావిధానాన్ని రాష్ట్రంలో అమలుచేసే ఆలోచనను సీఎం మానుకోవాలన్నారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి అంగునూరి రంజిత్, నాయకులు ఈశ్వర్, రాము, శ్రీనివాస్, అభి, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌కు సన్మానం


కొమిరిశెట్టి విజయ–తిరుపతి దంపతులను సన్మానిస్తున్న మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు

సిరిసిల్ల: గంభీరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్‌పర్సన్‌గా ఇటీవల నియమితులైన కొమిరిశెట్టి విజయ–తిరుపతి దంపతులను సిరిసిల్లలో శనివారం మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య సన్మానించారు. సిరిసిల్ల కొత్త బస్టాండు వద్ద విజయకు పూలమాల వేసి సత్కరించారు. కౌన్సిలర్ కల్లూరి రాజు, శంకర్, ఒజ్జెల అగ్గిరాములు, సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, స్థానికులు బాల్‌రెడ్డి, పాపారావు, జయంత్‌కుమార్, రిక్కుమల్ల సంపత్, దేవరాజు, మహేశ్ పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే జైలుకే..

- చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

చందుర్తి(వేములవాడ): మైనర్లకు వాహనాలు ఇస్తే జైలుకు పోవాల్సిందేనని చందుర్తి సీఐ గాండ్ల వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండలంలోని నర్సింగపూర్‌లో శనివారం రాత్రి 'పోలీసు మీ కోసం' నిర్వహించారు. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నర్సింగపూర్ వివాదాస్పద గ్రామంగా పోలీసు రికార్డులకెక్కిందన్నారు ఏమైనా సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. దాడులకు దిగితే సమస్యలు పరిష్కారం కావని స్పష్టం చేశారు. అపరిచితులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్‌తో యువత దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే 1930లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. చందుర్తి ఏఎస్సై బాపు, సిబ్బంది ఉన్నారు.

డెంగీతో వ్యక్తి మృతి


శ్రీనివాస్(ఫైల్)

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రానికి చెందిన నిరుపేద గుగ్గిళ్ల శ్రీనివాస్ కుటుంబాన్ని విధి వెక్కిరించింది. ఏ ఆధారం, ఆస్తులు లేని శ్రీనివాస్ ఇటీవల జ్యువెల్లరీ షాప్ పెట్టుకున్నారు. గత వారం రోజులుగా శ్రీనివాస్(35) జ్వరంతో బాధపడుతున్నాడు. ఐదు రోజులుగా కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ డెంగీ లక్షణాలతో శనివారం మృతిచెందాడు. శ్రీనివాస్ మృతి గ్రామంలో విషాదం నింపింది. మృతునికి భార్య సహన, కూతురు(7), కుమారుడు(5) ఉన్నారు. నిరుపేద శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వ ఆదుకోవాలని స్థానికులు కోరారు.

ఎంఈవోలకు సన్మానం


మాట్లాడుతున్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రప్రకాశ్

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని మండలాలకు ఎంఈవోలను నియమించడం శుభ పరిణామమని తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాశ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సీతానగర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం జిల్లా ప్రధానోపాధ్యాయుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల అదనపు బాధ్యతలు చేపట్టిన 13 మంది మండల విద్యాధికారులను సన్మానించారు. గతేడాది పదోన్నతి పొందిన ప్రధానోపాధ్యాయులను ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా సన్మానించారు. జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ చేనేత సెల్ కన్వీనర్‌గా ప్రకాశ్

సిరిసిల్లకల్చరల్: బీజేపీ చేనేత సెల్ జిల్లా కన్వీనర్‌గా సుంచు ప్రకాశ్ నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో చేనేత సెల్ రాష్ట్ర కన్వీనర్ మచ్చ సుధాకర్‌రావు నియామకపత్రాన్ని అందజేశారు. కో–కన్వీనర్లుగా వేముల రజనీకాంత్, రుద్ర శ్రీధర్, అన్నల్‌దాస్ వెంకటేశం, బోగ కమలాకర్, వడ్నాల శ్రీకాంత్, ఎనగందుల గణేశ్, పిస్క వెంకటేశం, గజ్జెల్లి అశోక్‌లను నియమించారు.

భక్తురాలు పర్సు అందజేత

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న ఆలయంలోని క్యూలైన్‌లో భక్తురాలు పోగొట్టుకున్న పర్సును ఎస్పీఎఫ్ సిబ్బంది తిరిగి అప్పజెప్పారు. శనివారం కుటుంబ సభ్యులతో కలిసి రాజన్న దర్శనానికి వచ్చిన భక్తురాలు పర్సు పోగొట్టుకుంది. గమనించిన ఎస్పీఎఫ్ సిబ్బంది పర్సుతోపాటు అందులోని రూ.6,300 నగదు, రెండు ఏటీఎం కార్డులను తిరిగి అప్పజెప్పారు.

ఐఐటీ విద్యార్థినికి ఆర్థిక సాయం



వీర్నపల్లి: మండలంలోని బావుసింగ్ నాయక్ తండా గ్రామానికి చెందిన విద్యార్థిని బాధవత్ మధులత ఐఐటీలో సీటు సాధించి ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. శనివారం విద్యార్థి తండ్రి రాములుకు ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతిరెడ్డి ఆధ్వర్యంలో రూ. 2,17,562 చెక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రవీణ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు, వైస్ చైర్మన్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెషర్స్ డే హంగామా



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

చందుర్తి : మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమానికి వేములవాడ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శరత్‌కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దేవరాజం, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ధాన్యం ఆరబోసిన రైతుపై కేసు

ముస్తాబాద్(సిరిసిల్ల): రోడ్డుపై ధాన్యం ఆరబోసిన రైతుపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ముస్తాబాద్ ఎస్సై గణేశ్ తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం ఆవునూర్‌లో ముస్తాబాద్–సిరిసిల్ల ప్రధాన రహదారిపై వెంకట్‌రెడ్డి అనే రైతు ధాన్యాన్ని ఆరోబోశాడు. గతంలో ఆవునూర్, రాంరెడ్డిపల్లె శివారులో ధాన్యాన్ని రహదారులపై ఆరబోయడం ద్వారా జరిగిన రోడ్డు ప్రమదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. రహదారులపై ధాన్యాన్ని ఆరబోయడం ద్వారా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంకట్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.